క్లుప్తంగా

ప్రమాదకరంగా చెరువు కట్ట



పగుళ్లు ఏర్పడి కుంగిపోయిన చెరువు కట్ట

నర్సాపూర్ రూరల్: మండలంలోని చిన్నచింత కుంట ఆముదాల చెరువు కట్టకు మధ్యలో పెద్ద ఎత్తున పగుళ్లు ఏర్పడి కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో పెద్ద వర్షాలు వస్తే చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు రైతులు, ప్రజాప్రతినిధులు కట్టకు మరమ్మతులు చేపట్టాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇరిగేషన్ శాఖ ఏఈ మణిభూషన్ వివరణ కోరగా.. త్వరలో మరమ్మతుల కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నోట్‌బుక్స్ అందజేత



ఖాజాపూర్‌తండాలో మొక్కలు నాటుతున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని ఖాజాపూర్ తండాలో హైదరాబాద్‌కు చెందిన చాణక్య, అహిల్య ఉమెన్స్ ఫౌండేషన్ సహకారంతో సానీక్ష ఫౌండేషన్ సభ్యులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్‌బుక్స్ అందించారు. అనంతరం విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన స్నాక్స్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో అహిల్యా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ పూనమ్ నోమూలాల్వార్, దత్తాత్రేయ బుని, సురేష్ కుమార్, రాజేశ్, సానీక్ష స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ శివ, డాక్టర్ మానెగల్ల భాస్కర్, సూర్యప్రకాష్, రవి, మహేశ్, భాను పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందిస్తున్న సంస్థ సభ్యులు

ఎంపీని కలిసిన ఎంపీటీసీ



రఘునందన్‌రావుకు పుస్తకాలు అందజేస్తున్న నర్సింలు

తొగుట(దుబ్బాక): మెదక్ ఎంపీ రఘునందన్ రావును మండల పరిధిలోని వెంకట్రావుపేట ఎంపీటీసీ కంకణాల నర్సింహులు ముదిరాజ్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీని సన్మానించడానికి పూలబొకేలకు బదులు నోట్ పుస్తకాలు, పెన్నులను అందజేశారు.

వృద్ధుడి అదృశ్యం



లక్ష్మణ్

దుబ్బాకటౌన్: వృద్ధుడు అదృశ్యమైన ఘటన దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్‌లో చోటుచేసుకుంది. సోమవారం దౌల్తాబాద్ ఎస్ఐ ప్రేమ్‌దీప్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన 54 యేళ్ల బాయికాడి లక్ష్మణ్ గత 15న పొలానికి వెళ్లివస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. వృద్ధుడి కొడుకు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పీఎం కిసాన్ అందరికీ ఇవ్వాలి

కొల్చారం(నర్సాపూర్): పీఎం కిసాన్ అందరికీ ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం ప్రారంభంలో అందరికీ సహకారం అందేదన్నారు. ప్రస్తుతం ఈ పథకం ద్వారా కొందరి రైతులకు పెట్టుబడి సాయం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి అందరికీ పెట్టుబడి సహకారం అందించాలని కోరారు.



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్ మసీదు వద్ద ఉన్న ముస్లింలు




మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్‌లో..



చిలప్‌చెడ్(నర్సాపూర్): బండపోతుగల్ మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా సోమవారం బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.



పాపన్నపేటలో..



వెల్దుర్తిలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



అల్లాదుర్గం(మెదక్): గడిపెద్దాపూర్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చేగుంట(తూప్రాన్): పోతాన్‌పల్లి ఈద్గా వద్ద..



రేగోడ్‌లో..



చిన్నశంకరంపేటలో..



కాడిపల్లిలో ..

వైభవంగా సీతారాముల కల్యాణం



పూజలు నిర్వహిస్తున్న ప్రతాప్‌రెడ్డి తదితరులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీకోదండ రామచంద్రస్వామి(రామునిబండ) ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు వారికి తీర్థప్రసాదాలు అందించారు. అలాగే కాంగ్రెస్ యూత్ నాయకుడు భానుప్రకాశ్ రావు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌కుమార్, ఎంపీటీసీ కిరణ్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

కష్టపడిన కార్యకర్తలకు ప్రాధాన్యమివ్వాలి



దీప్‌దాస్‌మున్షీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్‌పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యతనివ్వాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో దీప్‌దాస్‌మున్షీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడే నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణ, సంతోష్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి సిద్ధంగా మొక్కలు



రంగంపేట వన నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు



మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్న గుంతలు

- 80 వేల మొక్కలు నాటేందుకు ప్రణాళిక
- గుంతలు తీసే పనుల్లో నిమగ్నమైన ఉపాధి కూలీలు
- పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యం

కొల్చారం(నర్సాపూర్): మానవాళి మనుగడకు, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు చాలా అవసరం. మితిమీరిన భూతాపం తగ్గించాలంటే చెట్లను పెంచడం తప్పనిసరి. భావితరాలకు ప్రకృతి సంపదను ఇవ్వాలనే లక్ష్యంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మొక్కల పెంపకాన్ని ప్రభుత్వం చేపట్టింది. గ్రామాల్లోని వన నర్సరీలు, అటవీ శాఖ ఆధ్వర్యంలో పెంచిన మొక్కలను నాటేందుకు వర్షాకాలం అనువైన సమయం కావడంతో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

21 గ్రామాల్లో మొక్కల పెంపకం

మండలాన్ని పూర్తి హరిత వనంగా చేసేందుకు 21 గ్రామాల్లో గ్రామ నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కల పెంపకాన్ని గ్రామ పంచాయతీకి అప్పగిస్తూ చర్యలు తీసుకున్నారు. ఉపాధి హామీ అధికారుల పర్యవేక్షణలో ప్రస్తుతం మొక్కలు నాటడానికి పూర్తిగా అణువుగా మారాయి. 2023 - 24 ఏడాదికి గ్రామ నర్సరీలో 40 వేల మొక్కలను పెంచారు. వీటితో పాటు గతంలో కన్వెన్షన్ చేసినవి 49 వేల మొక్కలు ఉండగా.. మెయింటెన్స్ కింద 56 వేల మొక్కలున్నాయి. మొత్తంగా మండల వ్యాప్తంగా 3 లక్షల 15 వేల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ఏడాదికి 80 వేల మొక్కలు నాటేందుకు టార్గెట్‌గా పెట్టుకున్న అధికారులు గుంతలు తీయించే పనుల్లో నిమగ్నమయ్యారు. లక్ష్యానికి మించి మొక్కలు పెంపకం, అవసరమైన ఇతర మండలాలకు సైతం మొక్కలు సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

జూలై మొదటి వారంలో వన మహోత్సవం..

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూలై మొదటి వారంలో ప్రత్యేకంగా వన మహోత్సవం ద్వారా నిర్దేశించిన మొక్కలను పెద్ద ఎత్తున నాటనున్నారు. వీటిలో రోడ్లకు ఇరువైపులా, కమ్యూనిటీ స్థలాలు, చెరువులు, కుంటల, పొలాల కాల్వల వెంట నాటనున్నారు. హార్టికల్చర్‌లో భాగంగా ఆసక్తిగల రైతుల పొలాల్లో పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇచ్చేందుకు ఇప్పటికే అధికారులు గ్రామాల్లో ప్రత్యేక సర్వేను సైతం నిర్వహిస్తున్నారు.

లక్ష్యానికి అనుగుణంగా..



ఈ ఏడు వన మహోత్సవం ద్వారా లక్ష్యానికి మించి మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మండల స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులను, ప్రజలను భాగస్వామ్యం చేయడం, తద్వారా హరితహారాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయడమే లక్ష్యం. నాటిన మొక్కల సంరక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలి.

– మహిపాల్ రెడ్డి, ఏపీఓ, కొల్చారం



కాడిపల్లిలో బీజేపీ నాయకులు



కొల్చారం(నర్సాపూర్): రంగంపేటలో..



వెల్దుర్తిలో బైక్ ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

బంద్ ప్రశాంతం

మెదక్‌లో జరిగిన అల్లర్ల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా బీజేపీ, గో రక్షణ సమితి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం కార్యకర్తలు చేపట్టిన బంద్ ప్రశాంతంగా జరిగింది. ఆయా గ్రామాల్లో, పట్టణాల్లో బంద్‌కు వర్తక, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించి దుకాణాలు మూసి ఉంచారు. బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.



తూప్రాన్‌లో బీజేపీ శ్రేణులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



పాపన్నపేట(మెదక్): బంద్ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



రామాయంపేటలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలు



చేగుంటలో మూసేసిన దుకాణాలు



నర్సాపూర్‌లో మూతపడిన దుకాణాలు

అ'పూర్వ' సమ్మేళనం

దుబ్బాకటౌన్: దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1986–87లో పదోతరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకుని ఆటపాటలతో సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రంగారెడ్డి, ఉపాధ్యాయులు లింగమూర్తి, నర్సింహాచారి, విఠల్ దేవేందర్‌రెడ్డి, విద్యార్థులు శ్రీనివాస్ మల్లేశం, వీరేశం, అరుణ, విజయలక్ష్మి, నరసింహారెడ్డి, శ్రీదేవి, రామయ్య, బాలచారి, రాజిరెడ్డి తదితరులున్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పాఠశాల భవన నిర్మాణం ఊసేది ?

నర్సాపూర్: నియోజకవర్గ కేంద్రం నర్సాపూర్‌లోని మండల ప్రాథమిక పాఠశాల నంబర్ - 01 పాఠశాల భవనం నిర్మాణానికి నోచుకోవడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ప్రస్తుతం ఉన్న పాఠశాల భవనం శిథిలావస్థకు చేరినా.. కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. మండల ప్రాథమిక పాఠశాల నం.1 తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ మీడియంలో సుమారు 174 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల భవనం పాతది కావడంతో పాటు పలు గదులు శిథిలావస్థకు చేరాయి. దీంతో ఆ గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నప్పుడు వర్షం వస్తే విద్యార్థులను వరండాలోకి మారుస్తున్నారు. కొత్త భవనంలో ఒక గదిలో ఆఫీసు నిర్వహిస్తూ ఒక గదితో పాటు వరండాలో తరగతులు చేపడుతున్నారు. గదులు సరిపడక విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పాఠశాలలో టాయిలెట్స్ సైతం లేక మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రారంభం కాని పనులు

సుమారు రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం అమలు చేసిన మన ఊరు – మన బడి పథకం కింద స్థానిక పాఠశాలకు రూ.90లక్షలు మంజూరు చేసి టెండర్ పిలిచారు. టెండర్‌లో పనిని ఏ కాంట్రాక్టర్ తీసుకోక ముందే అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి భవనం నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అంతలోనే రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, కొత్త ప్రభుత్వం పాత పథకాన్ని పక్కన పెట్టడంతో స్థానిక పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు.



వరండాలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

నిధుల కోసం ఎదురుచూపులు


శిథిలావస్థకు చేరిన స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నం. 1 పాఠశాల భవనానికి గత ప్రభుత్వంలో మన ఊరు – మన బడి పథకం కింద నిధులు వచ్చినా.. టెండర్‌లో ఏ కాంట్రాక్టర్ పని తీసుకోనందున పనులు ప్రారంభం కాలేదు. కాగా పాఠశాల పాత పథకంలో ఉన్నందున కొత్త ప్రభు త్వం అమలు చేస్తున్న అమ్మ ఆదర్శపాఠశాల పథ కం కింద పాఠశాలకు నిధులు మంజూరు చేయలేదు.

నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం

పాఠశాలకు గతంలో మన ఊరు – మన బడి కింద నిధులు వచ్చినా.. టెండర్‌లో ఎవరు పని తీసుకోనందున పనులు ప్రారంభించలేదు. నామినేషన్ పద్ధతిన పనులు చేపట్టేందుకు ప్రయత్నించగా పనులకు నిధులు మంజూర కావడం లేదని కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. కాగా ప్రస్తుతం అమలవుతున్న అమ్మ ఆదర్శ పథకం కింద ఉన్నతాధికారుల సూచనల మేరకు నిధుల మంజూరు కోసం అంచనాలు తయారు చేసి పంపినాం. నిధులు మంజూరు కాగానే భవనం నిర్మాణ పనులు చేపడుతాం.

– రాధికలక్ష్మి, పీఆర్ డీఈఈ

ఇబ్బందిగా ఉంది



తమ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు లేవు. పాత భవనం శిథిలావస్థకు చేరడంతో పలు గదులు వదిలేశాం. వరండాలో తరగతులు చేపడుతున్నాం. గదులు సరిపడక విద్యార్థులు, మేము చాలా ఇబ్బంది పడుతున్నాం. – సర్వేష్, పాఠశాల హెచ్‌ఎం